క్లుప్తంగా

ముద్రగడను కలసిన తోట నరసింహం



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంతో మాట్లాడుతున్న తోట నరసింహం

కిర్లంపూడి: మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభాన్ని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో కలిసి జగ్గంపేట నియోజవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనకు ముద్రగడ ఆశీస్సులు కావాలని కోరినట్టు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయానికి కృషి చేస్తానని ముద్రగడ పద్మనాభం తెలిపారు. కార్యక్రమంలో ముద్రగడ గిరిబాబు, గణేశుల రాంబాబు, తోట రాంజీ, తోట బాబ్జీ, దోమాల గంగాధర్, జోకా శ్రీను, దాడి చినబుజ్జి, తోట అయ్యన్న, తోట వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రధాన కూడళ్లలో స్టాపర్ల ఏర్పాటు



జాతీయ రహదారిపై జగన్నాథగిరి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన స్టాపర్లు

తుని రూరల్: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని ప్రధాన కూడళ్లలో జరుగుతున్న ప్రమాదాలు నివారించేందుకు గాను రూరల్ పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. తరుచూ ప్రమాదాలు సంభవించే జగన్నాథగిరి, తేటగుంట, టి.తిమ్మాపురం, చేపూరు, వెలంపేట జంక్షన్లలో మూడు వరుసల్లో స్టాపర్లను ఏర్పాటు చేశారు. స్టాపర్లతో పాటు బారికేడ్లను సైతం ఉంచారు. ఆయా జంక్షన్లలో వాహనాల వేగాన్ని క్రమబద్ధీకరించేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు రూరల్ ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న తమపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ, మండలాధ్యక్షుడు కురాకుల రాజా నేతృత్వంలో ఎస్సై జి.సతీష్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యర్రవరం జాతీయ రహదారి మీదుగా పశువులకు అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని బీజేపీ మండల యువ మోర్చా అధ్యక్షుడు బీశెట్టి మురళి అడ్డుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా వాహనంలో ఉన్నవారు మురళిపై దాడి చేశారన్నారు. మురళిని వాహనం నుంచి తోసేసి చంపేస్తామని బెదిరించారన్నారు. దోషులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంధం అనిల్, గొల్లపూడి గణేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు, ఫ్లెక్సీల తొలగింపు



వి.కొత్తూరులో విగ్రహాలకు ముసుగులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

తుని రూరల్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. అలాగే గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు ఫ్లెక్సీలను తొలగించే పనుల్లో సిబ్బంది నిమగ్నమైనట్టు మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ఆఫీసర్, ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. ఆయా పార్టీల నాయకులు తమ ఫ్లెక్సీలను స్వచ్ఛంగా తొలగించుకునేందుకు సోమవారంతో గడువు ముగుస్తుందన్నారు. ఆ తర్వాత తామే స్వయంగా తొలగిస్తామన్నారు. ప్రైవేటు ఆస్తులపై ఫ్లెక్సీలు, ఇతరేతర ప్రచార సామగ్రి ఏర్పాటు చేసుకునేందుకు ముందస్తు అనుమతి పొందాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆయుష్మాన్ భవ!

- పేదల వైద్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం
- గ్రామాల్లో నూతన ఆస్పత్రి భవనాల నిర్మాణం
- అందుబాటులోకి అధునాతన పరికరాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గండేపల్లిలో నూతన పీహెచ్‌సీ భవనం

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆధునిక వసతులతో నూతన భవనాలు నిర్మాణంతో పాటు, ఆస్పత్రులకు అవసరమైన పరికరాలు సమకూర్చింది. జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో ఐదేళ్లలో ప్రభుత్వాస్పత్రుల దశమారి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

నియోజకవర్గంలో ఇలా...

గోకవరం సీహెచ్‌సీలో అధునాతన వసతులతో 30 పడకల ఆస్పత్రి భవనం అందుబాటులోకి వచ్చింది. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న గోకవరం ప్రభుత్వాస్పత్రిలో గతంలో అరకొర వసతులు ఉండేవి. ప్రతిరోజూ ఈ ఆస్పత్రికి వందకు పైగా ఓపీ ఉండేది. వైద్య సిబ్బంది సేవలు అందించేందుకు సైతం సరైన వసతులు ఉండేవి కావు. ఇరుకు గదుల్లోనే డాక్టర్లు వైద్య సేవలందించాల్సిన పరిస్థితి ఉండేది. 2012వ సంవత్సరంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఇందిరమ్మ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గోకవరం ప్రభుత్వాస్పత్రిని సందర్శించి 100 పడకల ఆస్పత్రి భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం కార్యాచరణ చేపట్టకపోవడంతో హామీ అమలు కాలేదు. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం సైతం ఆస్పత్రిని పట్టించుకోకపోవడంతో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత డిసెంబర్ నెలలో ఈ భవనం అందుబాటులోకి వచ్చింది. అలాగే కొత్తపల్లిలో నూతన పీహెచ్‌సీ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా

గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలో రూ.4.50 కోట్లతో 30 పడకల ఆస్పత్రి భవనం నిర్మించారు. ఈ ఆసుపత్రి ప్రస్తుతం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. గండేపల్లిలో పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరగా దాని స్థానంలో నూతనంగా భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే జగ్గంపేటలో సీహెచ్‌సీ భవనానికి నూతన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కిర్లంపూడిలో మూడు ప్రభుత్వాస్పత్రులు ఉండగా వాటిని ఆధునీకరించి మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు.

24 గంటలూ వైద్య సేవలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందుతోంది. ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా చూడటంతో పాటు 24 గంటలూ వైద్య సేవలందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే సీహెచ్‌సీల్లో శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రసూతి వైద్య సేవల్లో గోకవరం సీహెచ్‌సీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ ప్రభుత్వాస్పత్రిలో నెలకు 30 డెలివరీలు లక్ష్యం కాగా లక్ష్యానికి మించి ప్రతి నెలా 70 డెలివరీలు చేస్తున్నారు. ఈవిధంగా జూన్ నెలలో అందించిన సేవలకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలోని ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ గణనీయంగా పెరిగింది.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగింది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఆస్పత్రులకు నూతన భవనాలు మంజూరు చేయడంతో పాటు అనేక వసతులు, అత్యాధునిక పరికరాలు సమకూర్చారు. నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగింది.

– నరాలశెట్టి నర్సయ్య, గోకవరం

రోగులకు మెరుగైన సేవలు



గోకవరం సీహెచ్‌సీలో నూతన భవనం అందుబాటులోకి రావడంతో ఓపీ పెరిగింది. ప్రస్తుతం జనరల్ ఫిజీషియన్, సర్జన్, గైనిక్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వారానికి ఒకసారి అర్థో సేవలు అందిస్తున్నాం. ఆస్పత్రిలో పలు శస్త్రచికిత్సలు సైతం విజయవంతంగా నిర్వహించాం. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

– డాక్టర్ వనజాకుమారి, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, గోకవరం



గోకవరంలో అందుబాటులోకి వచ్చిన 30 పడకల సీహెచ్‌సీ భవనం

వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల మద్దతు

- ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- కొత్తయర్రవరంలో ప్రచారం



కొత్తయర్రవరంలో ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల ప్రజల మద్దతు ఉందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని కొత్తయర్రవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడపా పార్థసారథి, బీశెట్టి అప్పలరాజు, అడపా ఈశ్వరరావు, నీరుకొండ అర్జునరావు, దాసరి రమేష్, గుల్లంపూడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- కృష్ణవరంలో ఎన్నికల ప్రచారం



కృష్ణవరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న తోట వాణి, శ్రీనిధి

కిర్లంపూడి: పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని కృష్ణవరంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి తోట వాణి, ఆమె కోడలు తోట శ్రీనిధి ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, సర్పంచ్ గొరకపూడి అనంత లక్ష్మి, గొరకపూడి గోపీనాథ్, మాజీ సర్పంచ్ కోదండం, ఎంపీటీసీ గొరకపూడి మమతా, ఓలేటి రాజు, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్ఏ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపు అస్త్రాలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- టి.రాయవరం, పీజే పురం గ్రామాల్లో గడప గడపకూ..



టి.రాయవరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ గెలుపు అస్త్రాలని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని టి.రాయవరం, పీజే పురం గ్రామాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, బత్తుల నాగార్జున, కోడి శ్రీను, దాడిశెట్టి చక్రధర్, జల్లిగంపల ప్రభాకర్, ఎంపీటీసీలు తటవర్తి రామన్నదొర, అమరాది కాశీ, పిల్లా చిన్నా, సీంద్రపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక శ్రేయస్సుకు భద్రతా ప్రమాణాలు కీలకం

- డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాధాకృష్ణ

సామర్లకోట: ప్రతిఒక్కరూ భద్రత ప్రమాణాలను పాటిస్తూ, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో నిర్వహించిన భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు, ఆయా పరిశ్రమల్లో విధులు నిర్వహించే సమయంలో నిబంధనలతో పాటు, భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. కొన్ని సమయాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారితో పాటు, ఎదుటి వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. వారం రోజుల పాటు ఫ్యాక్టరీలోని ఉద్యోగులు, కార్మికులు, వారి పిల్లలకు అనేక ఆటల పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ అనిల్‌కుమర్ బిజావత్, ఇతర అధికారులు టి.నీరజ్‌కుమార్, రాజేందర్‌సింగ్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

పదిష్టంగా పరీక్షలు

- పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- విద్యార్థులకు వసతులు కల్పించిన అధికారులు



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

తుని: పదో తరగతి పరీక్షలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు సందడి నెలకొంది. అధికారులు ఉదయం 9.15 గంటలకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు పరీక్ష కావడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

11 సెంటర్లలో...

తునిలో విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన 11 సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఈవో పరవాడ గీతాదేవి తెలిపారు. రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, శ్రీప్రకాష్, సీతారాంపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, సిద్ధార్థ, లయోలా, భాష్యం, రెసిడెన్షియల్ గరల్స్ ఉన్నత పాఠశాల, జీటిడబ్ల్యూఏ గరల్స్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తేటగుంట) కేంద్రాల్లో 2249 మందికి గాను 2215 మంది పరీక్షకు హాజరైనట్టు ఎంఈఓ వివరించారు. 34 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్నివసతులు కల్పించారు.

కోటనందూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోటనందూరులో హైస్కూల్, మదర్ విద్యానికేతన్, పాతకొట్టాం హైస్కూల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు సెంటర్లలో 630 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణను ఎంఈఓలు ఏవీఎస్ శ్రీనివాస్, రామశేఖర్ పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గండేపల్లి: మండలవ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మూడు కేంద్రాల్లో 513 మంది విద్యార్థులకు గాను 495 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. గండేపల్లిలో 172 మందికి గాను 157 మంది, తాళ్లూరులో 161 మందికి గాను 158 మంది, మల్లేపల్లిలో 180 మందికి గాను పూర్తి స్థాయిలో పరీక్షలకు హాజరైనట్టు ఆయన వివరించారు.

శంఖవరం: మండలవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఆదర్శ పాఠశాల, జెడ్పీ హైస్కూల్, కత్తిపూడి జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 892 విద్యార్థులకు గాను 867 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఏ ఎస్‌వీ రమణ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

టెన్త్ పరీక్షకు 32 మంది గైర్హాజరు

తొండంగి: మండలంలోని టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. బెండపూడిలో 199 మంది, తొండంగిలో 229 మంది, దానవాయిపేట 286 మంది, పెరుమాళ్లపురంలో 267 మంది వెరసి మొత్తం 981 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా మొదటి రోజు పరీక్షలకు 949 మంది హాజరయ్యారని ఎంఈవో షేక్‌బాబ్జీ తెలిపారు. బెండపూడిలో ఒకరు, తొండంగిలో 11 మంది, దానవాయిపేట ఐదుగురు, కె.పెరుమాళ్లపురంలో 15 మంది వెరసి మొత్తం 32 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు వివరించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రత్తిపాడు, ఒమ్మంగి, ధర్మవరం, లంపకలోవ గ్రామాల్లో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 865 మంది హాజరయ్యారు. 44 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

54 మంది విద్యార్థులు గైర్హాజరు

గోకవరం: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో గోకవరం, కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్, భూపతిపాలెం, వీరలంకపల్లి గురుకుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. వీటిలో 848 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 794 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. ఎంఈఓలు బి.గౌరమ్మ, చిమ్మరాజుదొర పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

పరీక్షలకు 36 మంది గైర్హాజరు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8:30 గంటలకే చేరుకున్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకూ నిర్వహించారు. మండల కేంద్రమైన ఏలేశ్వరంలో మూడు, లింగంపర్తి ఒకటి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 897 మంది విద్యార్థులకు గాను 861 మంది పరీక్షలు రాశారు. 36 మంది విద్యార్థులకు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు పరీక్షల సూపరింటిండెంట్‌గా వట్టి వెంకటరమణ, ప్రభుత్వోన్నత పాఠశాలకు సూపరింటిండెంట్‌గా ఎస్.లక్ష్మీతులసి, భాష్యం స్కూల్‌కు సూపరింటిండెంట్‌గా ఎస్‌జే లక్ష్మణరావు, లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు సూపరింటిండెంట్‌గా రజనీకుమారి వ్యవహరించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 1047 మంది విద్యార్థులకు గాను 1013 మంది పరీక్షలకు హాజరు కాగా 34 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.



తునిలో రాజా ప్రభుత్వోన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



శంఖవరంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

సామర్లకోట: మండల పరిధిలో 320 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నట్టు ఇటీవల జరిగిన సర్వేలో గుర్తించారని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరావు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులున్న తల్లిదండ్రులు భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మంచి సేవలందించడంతో పాటు, వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తారని చెప్పారు. ప్రతి సోమవారం భవిత కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపీని ఆయన పరిశీలించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు భవిత కేంద్రంలో చేస్తున్న ఫిజియోథెరపీని గమనించి, ప్రతి రోజూ ఇంటి వద్ద కూడా దివ్యాంగ విద్యార్థులతో చేయించాలని సూచించారు. ఇటీవల భవిత కేంద్రంలోని విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు ఎలా ఉపయోగిస్తున్నారో ఆరాతీశారు. భవిత కేంద్రానికి వస్తున్న విద్యార్థుల్లో మార్పులు రావడాన్ని గమనించి, సిబ్బందిని అభినందించారు. మానసికంగా మెరుగుపడిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారని తెలిపారు.

కుప్పకూలిన పంచాయతీ కార్యదర్శి

పెద్దాపురం: విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఉద్యోగి కుప్పకూలిన సంఘటన సోమవారం పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గోరింట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటలక్ష్మీదేవి సోమవారం ఉదయం ఫోన్‌కాల్ మాట్లాడుతుండగా, బీపీ అధికం కావడంతో కుప్పకూలారు. అక్కడున్న సచివాలయ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పులిమేరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. ఇటీవల అనారోగ్యంతో సెలవులో ఉన్న ఆమె, ఇటీవల విధుల్లో చేరారు.